E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 03-07-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




బాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు » 3లో

# ఘనా చేరుకున్న ప్రధాని మోడీ..

ఈ కబురు: ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ టూర్ ప్రారంభమైంది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా మోడీ బుధవారం ఆఫ్రికన్ దేశమైన ఘనా చేరుకున్నారు. ఆ దేశ రాజధాని అక్రలోని విమానాశ్రయంలో దిగిన మోడీకి అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామా ఘన స్వాగతం పలికారు. అనంతరం గార్డ్ హాఫ్ హానర్ ఇచ్చారు. ఆ తర్వాత మోడీ బస చేసేందుకు ఓ హోటల్‌కు వెళ్లగా అక్కడి భారతీయులు ఆయనకు వెల్‌కమ్ చెప్పారు. 30 ఏళ్లలో ఓ భారత ప్రధాని ఘనాను సందర్శించడం ఇదే తొలిసారి. అంతకుముందు 1995లో పీవీ నరసింహారావు ఘనాలో పర్యటించారు. ఈ టూర్‌లో భాగంగా మోడీ ప్రెసిడెంట్ మహామాతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.





తరువాయి 2లో

## 'ఇంటర్'పై అసెంబ్లీలోనూ చర్చిద్దాం

- ఇంటర్‌లో ఉత్తీర్ణత ఎందుకు తగ్గుతోందో పరిశీలించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రతి పాఠశాలలో భారీ జాతీయ జెండా ఏర్పాటుకు ఆదేశం
- ఇంటర్ వరకు డ్రాపౌట్లు ఉండొద్దు
- 9/12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి



ఈ కబురు, హైదరాబాద్: టెన్త్ పూర్తి చేసిన విద్యార్థి ఇంటర్‌లో ఎందుకు ఉత్తీర్ణత సాధించడం లేదో ఆలోచించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితిపై అధ్యయనం చేయాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియెట్ పూర్తి చేసేలా చూడాలన్నారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని, ఇంటర్‌లో ఆ శాతం గణనీయంగా తగ్గిపోతోందని చెప్పారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ కీలకమైందంటూ ఈ సమస్యను పరిష్కరించే దిశగా దృష్టి పెట్టాలని కోరారు.

తరువాయి 2లో

## కృష్ణమ్మ గలగల.. గోదారి వెలవెల!

ఈ కబురు, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లు జలకళను సంతరించుకొంటున్నాయి. ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు అన్ని రిజర్వాయర్లలోకి వరద కొనసాగుతోంది. ప్రస్తుత సీజన్‌లో శ్రీశైలంలోకి సుమారు 140 టీఎంసీలు వచ్చాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు కూడా నీటి విడుదల మొదలైంది.



తరువాయి 2లో

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క నెల పనిచేయండి: సీఎం రేవంత్

సామాజిక బాధ్యతగా పేదలకు సేవలందించండి

వైద్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

నిమ్స్, ఉస్మానియా లాంటి ఆసుపత్రుల్లో వారం రోజులు పనిచేసినా చాలు

సేవలందించేందుకు అమెరికా వైద్యులు సిద్ధం..

అందరి కోసం ఓ వేదిక

ఏఐజీ ఆస్పత్రి సేవలు మనకందరికీ గర్వకారణం

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి భారతరత్న కోసం తన వంతు కృషి చేస్తానన్న సీఎం


బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రి ప్రారంభం




తరువాయి 2లో

## సాగునీటి హక్కులకు మరణశాసనం రాసిందే కాంగ్రెస్

ఈ కబురు, హైదరాబాద్: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ.. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన మీరు.. అహంకారంతో మాట్లాడితే ప్రజలు అధఃపాతాళానికి తొక్కేస్తారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి



తరువాయి 2లో

## 'పీఆర్ స్టంట్స్ చేసేవారికే సక్సెస్..' పరోక్షంగా పూనమ్ కౌర్ ట్వీట్!

» 5లో




## మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. 9 వేల మందికి నోటీసులు!

» 4లో




## రద్దీ ఉంటే రేట్లు పెంచుకోవచ్చు.. క్యాబ్ సంస్థలకు కేంద్రం పచ్చజెండా

» 4లో



## రష్యాతో వ్యాపారం చేస్తే.. భారత్‌పై 500% సుంకం: అమెరికా

'రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తాం. ఆ దేశం నుంచి చమురును భారత్, చైనాలు 70శాతం కొనుగోలు చేస్తున్నాయి' అని లిండ్సే పేర్కొన్నారు. ఆగస్టులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ బిల్లుపై ట్రంప్ కూడా ఓకే చెప్పారని వెల్లడించారు. రష్యాను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే యూఎస్ ప్రయత్నాల్లో ఇది ఒకటిగా తెలుస్తోంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే..

తరువాయి 3లో



# 14న రేషన్ కార్డుల పంపిణీ

**సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం**

**పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి**

**ఎరువులు అందుబాటులో ఉంచాలి: మంత్రి లక్ష్మణ్**

**రూ.1,200 కోట్లతో రోడ్ల అభివృద్ధి: మంత్రి కోమటిరెడ్డి**



ఈ కబురు: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 14న కొత్త రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ ఈ విషయం వెల్లడించారు. 14న సాయంత్రం 6 గంటలకు తిరుమలగిరిలో నిర్వహించే బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉంటుందన్నారు.

తరువాయి 2లో

## నాకు ఇంకో దారి లేదు: 'సీఎం పదవి'పై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు



ఈ కబురు: కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. "నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి..?" అని బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు భాజపా, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..'ఆయన (సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి" అని మాట్లాడారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తృత చర్చ నడిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది.అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. "నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దృష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం" అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు. ఈ ఊహాగానాల వెనక భాజపా కుట్ర ఉందని విమర్శించారు.

## వరుసగా మూడో మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం.. ఈసారి ఊచకోత

» 6లో



ఈ-కబురు
03-07-2025
గురువారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# 'ఇంటర్'పై అసెంబ్లీలోనూ చర్చిద్దాం



ఈ కబురు, హైదరాబాద్: టెన్త్ పూర్తి చేసిన విద్యార్థి ఇంటర్‌లో ఎందుకు ఉత్తీర్ణత సాధించడం లేదో ఆలోచించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితిపై అధ్యయనం చేయాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియెట్ పూర్తి చేసేలా చూడాలన్నారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని, ఇంటర్‌లో ఆ శాతం గణనీయంగా తగ్గిపోతోందని చెప్పారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ కీలకమైందంటూ ఈ సమస్యను పరిష్కరించే దిశగా దృష్టి పెట్టాలని కోరారు. బుధవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో 9 నుంచి 12వ తరగతి వరకూ విద్య అందుబాటులో ఉందని, ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు తెలిపారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో 12వ తరగతి వరకూ ఉన్న పాఠశాలలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సీఎం సూచించారు. విద్యా కమిషన్, ఆ విభాగంలో పనిచేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు.

ఇంటర్ విద్యపై అసెంబ్లీలో చర్చిస్తాం

యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలల నిర్మాణ ప్రక్రియ ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంటర్మీడియెట్ విద్య మెరుగుకు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

ఇంటర్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టి పెట్టాలని సూచించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను సీఎం పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ గలగల.. గోదారి వెలవెల!



ఈ కబురు, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లు జలకళను సంతరించుకొంటున్నాయి. ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు అన్ని రిజర్వాయర్లలోకి వరద కొనసాగుతోంది. ప్రస్తుత సీజన్‌లో శ్రీశైలంలోకి సుమారు 140 టీఎంసీలు వచ్చాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు కూడా నీటి విడుదల మొదలైంది. గోదావరిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇప్పటివరకు నామమాత్రంగానే నీటి నిల్వలు పెరిగాయి. ఎగువన మహారాష్ట్రలోని జైక్వాడి నుంచి దిగువన ధవళేశ్వరం వరకు నామమాత్రంగానే ప్రవాహాలున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే కృష్ణాలో ప్రవాహం మొదలైనా తర్వాత కొన్నాళ్లపాటు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే గత కొన్ని రోజులుగా మళ్లీ ప్రవాహాలు మొదలుకావడంతో పరిస్థితి ఆశాజనకంగా కనిపిస్తోంది. అన్ని ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీటిని విడుదలచేసే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. ఎగువన ఉన్న ఆలమట్టిలో 91 టీఎంసీల నిల్వ ఉండగా, 85 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దీంతో 70 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దిగువన ఉన్న నారాయణపూర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి దగ్గరగా ఉండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా కిందకు వదులుతున్నారు. ఇందులో ఆయకట్టు అవసరాలకు, కాలువలకు కూడా విడుదల చేశారు. తుంగభద్ర, జూరాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీశైలం నుంచి కూడా దిగువన సాగర్‌కు నీటిని వదిలారు. శ్రీశైలం నిండటానికి మరో 50 టీఎంసీలు అవసరం. ప్రస్తుత ప్రవాహం కొనసాగితే మరో వారం రోజుల్లో నిండే అవకాశం ఉంది. గోదావరి బేసిన్‌లో మాత్రం ఇలాంటి పరిస్థితి నెలకొనేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

మొదటి పేజీ తరువాయి

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క నెల పనిచేయండి: సీఎం రేవంత్



ఈ కబురు, హైదరాబాద్/బంజారాహిల్స్: 'రాష్ట్రంలో చదువుకున్న వైద్యులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా. ఏడాదిలో 11 నెలలు మీకు నచ్చిన ఆసుపత్రిలో, మీకు నచ్చిన వేతనానికి పనిచేయండి. మీకు నచ్చిన జీవితాన్ని లీడ్ చేయండి. మిగతా నెలరోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయండి. సామాజిక బాధ్యతగా పేదలకు వైద్యం అందించండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిమ్స్, ఉస్మానియా వంటి ఆసుపత్రుల్లో వారం రోజులు పనిచేసినా చాలని, ఏ ఆసుపత్రిలో పనిచేయాలనుకుంటున్నారో ముందుగా తెలియజేయాలని కోరారు. అమెరికా నుంచి వచ్చే వైద్యులూ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇటువంటి వారందరినీ ఒక వేదికపైకి తీసుకొస్తామని తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆసుపత్రి ప్రారోత్సవంలో ఆయన మాట్లాడారు.

### రోగాల నివారణకు పరిశోధనలు జరగాలి

'ఈ రోజు ఖరీదైనది ఏదైనా ఉందంటే అది వైద్యం. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రారంభించారు. అప్పట్లో రూ.2 లక్షలు ప్రకటిస్తే, ఈ రోజు దానిని రూ.10 లక్షలకు పెంచాం. సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,400 కోట్లు చెల్లించాం. ఇదంతా రోగం వచ్చిన తర్వాత బాగు చేయడానికి ఖర్చు చేస్తున్నాం. కానీ రోగాలను నివారించేందుకు ముందస్తుగా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉంది. 60 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ సమయంలో హైదరాబాద్‌లో ఐడీపీఎల్ ప్రారంభించారు. డాక్టర్ రెడ్డీస్, ఎస్ఓఎల్, హెటిరో యాజమాన్యాలు ఐడీపీఎల్ మాజీ ఉద్యోగులేనని భావిస్తున్నా. ఏఐజీ ఆసుపత్రికి వైద్య సేవల కోసం 66 దేశాల నుంచి రోగులు వస్తున్నారు. ఇది మనందరికీ గర్వకారణం. గతంలో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ఉండేది. ఇప్పుడు వైద్యం అంటే లావాదేవీలన్నట్లుగా మారింది. అయితే నగర ప్రజలకు రెండో అతిపెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్నా. ఆయన హైదరాబాద్‌కు, తెలంగాణకు గొప్ప పేరు తీసుకొచ్చారు. నాగేశ్వర్‌రెడ్డి సేవలను గుర్తించిన కేంద్రం పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఆయనకు భారతరత్న ఒక్కటే మిగిలి ఉంది. భారతరత్నకు ఆయన అర్హులు. దీని కోసం ముఖ్యమంత్రిగా నావంతు ప్రయత్నం చేస్తా. ఆయనకు ఖచ్చితంగా భారతరత్న వస్తుందని భావిస్తున్నా..' అని సీఎం చెప్పారు.

### డిసెంబర్ నాటికి అందుబాటులోకి 7 వేల పడకలు

'గోషామహాల్‌లో రూ.3 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి పనులు ప్రారంభించాం. హైదరాబాద్ నిమ్స్, వరంగల్‌లో 2 వేల పడకల చొప్పున, టిమ్స్ అల్వాల్, ఎల్‌బీనగర్, సనత్‌నగర్‌లో వెయ్యి పడకల చొప్పున కొత్తగా మొత్తం 7 వేల పడకలు ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రి అనగానే ఉన్న ప్రతికూల అభిప్రాయాన్ని దూరం చేసేలా పనిచేస్తున్నా..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

### జపనీస్ నేర్చుకోవాలి

'రాష్ట్రంలో విద్యకు రూ.21,500 కోట్లు, వైద్యానికి రూ.11,500 కోట్ల వ్యయంతో అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. జీసీసీ, ఐటీ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ గమ్యస్థానంగా నిలుస్తోంది. మధ్య, తూర్పు దేశాల నుంచి వచ్చే రోగులు ఢిల్లీ, బెంగళూరు, కొల్‌కతాలో దిగి హైదరాబాద్ చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రిని కలిసి హైదరాబాద్‌కు నేరుగా విమానాలు నడిపించాలని కోరాం. జపాన్‌లో వయసు పైబడిన వారు అధికంగా ఉన్నారు. అక్కడ వైద్య సేవలు ఎక్కువగా అవసరం ఉన్నాయి. కాబట్టి మన దగ్గర నర్సింగ్ సిబ్బంది జపాన్ భాష నేర్చుకోవాలి..' అని రేవంత్ సూచించారు.

### తెలంగాణ ప్రణాళికలో నాగేశ్వర్‌రెడ్డి భాగస్వాములు కావాలి

'భారత్ 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా ముందుకెళుతోంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను వచ్చే పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రభుత్వం డాక్యుమెంట్ తయారు చేస్తోంది. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుంది. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, ఒక్కొక్కరికి యూనిక్ నంబరుతో గుర్తింపు కార్డు అందిస్తాం. రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కూడా భాగస్వాములు కావాలని కోరుతున్నా.

### మనమే నంబర్ వన్

తలసరి ఆదాయం, రెవెన్యూ, శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్ నియంత్రణలో మనమే నంబర్-1. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన పోటీలో హైదరాబాద్‌కు ప్రథమ బహుమతి వచ్చింది. నగర సీపీ సీవీ ఆనంద్ దాన్ని అందుకున్నారు. ఇలాంటివన్నీ మనం బ్రాండింగ్ చేసుకోవాలి. ఇటీవల ఒకవైపు యుద్ధ వాతావరణం.. మరోవైపు ప్రపంచ సుందరి పోటీలు జరుగుతున్నాయి. శాంతిభద్రతల సమస్యపై చర్చలు జరుగుతున్న సమయంలో.. హైదరాబాద్‌లో ప్రపంచ దేశాలకు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా హైలీ ప్రొటెక్టెడ్ సిటీ (అధిక రక్షణతో కూడిన నగరం) అనే విశ్వాసాన్ని కల్పించగలిగాం. అయితే కొన్ని దేశాలు భారత్‌ను ఇంకా వెనుకబడిన దేశంగానే చూస్తున్నాయి. దీన్నుంచి బయటపడాలి..' అని సీఎం అన్నారు.

### 140 గ్రామాలు దత్తత తీసుకున్న ఏఐజీ

ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు సమీపంలోని 140 గ్రామాలను తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో మెడికల్ కేర్ బాధ్యతలు తాము నిర్వర్తిస్తున్నామని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీదారులు ఏఐజీని సందర్శించి, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇలాంటి అధునాతన టెక్నాలజీ లేదని వ్యాఖ్యానించినట్లు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# రష్యాతో వ్యాపారం చేస్తే.. భారత్‌పై 500% సుంకం: అమెరికా



'రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తాం. ఆ దేశం నుంచి చమురును భారత్, చైనాలు 70శాతం కొనుగోలు చేస్తున్నాయి' అని లిండ్సే పేర్కొన్నారు. ఆగస్టులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ బిల్లుపై ట్రంప్ కూడా ఓకే చెప్పారని వెల్లడించారు. రష్యాను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే యూఎస్ ప్రయత్నాల్లో ఇది ఒకటిగా తెలుస్తోంది. ఈ బిల్లు అమల్లోకి వస్తే.. రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఇక, ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే దేశాల కోసం లిండ్సే మరో ఒప్పందాన్ని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది. తక్కువ సుంకాలతో భారత్‌తో డీల్..

భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరనుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. చాలా తక్కువ సుంకాలతోనే ఈ డీల్ ఉండనున్నట్లు తెలిపారు. 'త్వరలోనే భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నాం. అది ఒక కొత్త డీల్ అవుతుంది. ప్రస్తుతం భారత్ ఇంకా దాన్ని అంగీకరించలేదు. వాళ్లు డీల్‌కు ఒప్పుకుంటే తక్కువ సుంకాలు విధించేలా ఒప్పందం కుదురుతుంది' అని అధ్యక్షుడు పేర్కొన్నారు. జులై 9 కల్లా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే దీనిపై చర్చలు కూడా జరుపుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి

# ఘనా చేరుకున్న ప్రధాని మోడీ.



ఈ కబురు: ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ టూర్ ప్రారంభమైంది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా మోడీ బుధవారం ఆఫ్రికన్ దేశమైన ఘనా చేరుకున్నారు. ఆ దేశ రాజధాని అక్రలోని విమానాశ్రయంలో దిగిన మోడీకి అధ్యక్షుడు జాన్ డ్రామానీ మహామా ఘన స్వాగతం పలికారు. అనంతరం గార్డ్ హాఫ్ హానర్ ఇచ్చారు. ఆ తర్వాత మోడీ బస చేసేందుకు ఓ హోటల్‌కు వెళ్లగా అక్కడి భారతీయులు ఆయనకు వెల్‌కమ్ చెప్పారు. 30 ఏళ్లలో ఓ భారత ప్రధాని ఘనాను సందర్శించడం ఇదే తొలిసారి. అంతకుముందు 1995లో పీవీ నరసింహారావు ఘనాలో పర్యటించారు. ఈ టూర్‌లో భాగంగా మోడీ ప్రెసిడెంట్ మహామాతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇంధనం, వ్యవసాయం, డిజిటల్ టెక్నాలజీ సహా పలు రంగాల్లో ఇరు దేశాల మధ్య అనేక ఒప్పందాలు జరగనున్నట్టు తెలుస్తోంది. తన పర్యటనకు ముందు మోడీ మాట్లాడుతూ.. ఘనా గ్లోబల్ సౌత్‌లో భారత్‌కు విలువైన భాగస్వామి అని కొనియాడారు. ఆఫ్రికన్ యూనియన్, పశ్చిమ ఆఫ్రికా దేశాల ఆర్థిక సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఘనా పర్యటన అనంతరం ప్రధాని మోడీ ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు.

### ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటన షురూ.. షెడ్యూల్ ఇదే..

ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల విదేశీ పర్యటనకు బుధవారం శ్రీకారం చుట్టారు. తొలుత ఆయన ఢిల్లీ నుంచి ఘనాకు విమానంలో బయలుదేరారు. నేటి నుంచి జూలై 9 వరకు ప్రధానమంత్రి మోదీ విదేశీ పర్యటన సాగనుంది. తన పర్యటనలో భాగంగా ఆయన నేడు, రేపు ఘనాను సందర్శించనున్నారు. మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఘనా అధ్యక్షునితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఆర్థిక, ఎనర్జీ, డిఫెన్స్ పరస్పర సహకారంపై చర్చ జరగనుంది. జూలై 34 తేదీల్లో ట్రినిడాడ్, టోబాగోలో ప్రధాని పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రినిడాడ్ అధ్యక్షురాలు, ప్రధాని బిసెసర్‌తో భేటీ కానున్నారు. అలాగే ట్రినిడాడ్ పార్లమెంటులో సంయుక్త సభను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు.



# 14న రేషన్ కార్డుల పంపిణీ:

ఈ కబురు: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 14న కొత్త రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ ఈ విషయం వెల్లడించారు. 14న సాయంత్రం 6 గంటలకు తిరుమలగిరిలో నిర్వహించే బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులకోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 13లోగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప ఎన్నికలున్న చోట కొద్దిమందికి రేషన్ కార్డులు ఇచ్చిందే తప్ప అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్.. 44 కిలోమీటర్లలో 35 కిలోమీటర్లు పూర్తయిందన్నారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి హెలికాప్టర్ ద్వారా ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే చేసి పనులు పునఃప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నిరకాలుగా అండగా ఉంటుందని మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, అలాకాకుండా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. వానాకాలంలో విద్యుత్తు సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

రూ.1,200 కోట్లతో రోడ్లు: మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా రూ.1,200 కోట్లతో అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్ల నిర్మాణం చేపడతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. అధికారులు పథకాల అమలులో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దన్నారు.



# సాగునీటి హక్కులకు మరణశాసనం రాసిందే కాంగ్రెస్

ఈ కబురు, హైదరాబాద్: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ.. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన మీరు.. అహంకారంతో మాట్లాడితే ప్రజలు అధఃపాతాళానికి తొక్కేస్తారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ధ్వజమెత్తారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై.. హరీశ్‌రావు బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. "గోదావరిలో 968 టీఎంసీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. అయితే కృష్ణాలో 299:512 ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదే కదా! 18.10.2013 నాడు ఉమ్మడి ఏపీ ప్రభుత్వం.. జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి రిపోర్టు ఇచ్చింది. ఇదే రిపోర్టును శాసన సభలోనూ పెట్టింది. కృష్ణాలో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీలు ఇచ్చినట్లు అందులో ఉంది. అలా తెలంగాణ సాగునీటి హక్కులకు మరణ శాసనం రాసిందే కాంగ్రెస్ పార్టీ" అని హరీశ్‌రావు ఎండగట్టారు. తెలంగాణ సాగునీటికి ఎవరు ద్రోహం చేశారో అన్ని డాక్యుమెంట్లతో అసెంబ్లీలో చర్చించడానికి తాను సిద్ధమని, అయితే మైక్ కట్ చేయకుండా తనకు అవకాశమివ్వాలని ఆయన పేర్కొన్నారు. "మీరు సాంకేతికంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి కానీ.. మీ హృదయం ఇంకా తెదేపాలోనే ఉంది. జులై 6, 2024న ప్రజా భవన్‌కు చంద్రబాబును పిలిచి.. విభజన హామీల ముసుగులో గోదావరి బనకచర్ల మధ్య చీకటి ఒప్పందం జరిగింది. ఆ తర్వాతే సెప్టెంబరు 13, 2024న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీసమేతంగా విజయవాడలో చంద్రబాబును కలిసి బనకచర్లకు మద్దతు చెప్పి వచ్చారు. ఈ క్రమంలోనే అదే సంవత్సరం నవంబరు, డిసెంబరు మాసాల్లో ఈ ప్రాజెక్టుకు సహకరించాలని, నిధులు కేటాయించాలని చంద్రబాబు.. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశారు. ఈ విషయంపై జనవరి 24, 2025న నేను నిలదీయగానే.. అదే రోజు రాత్రి పాత తేదీతో 22.1.2025న లేఖ రాసినట్లు సృష్టించి.. ఆ లేఖను విడుదల చేశారు. ఎపెక్స్ కమిటీ సమావేశంలో అసలు గోదావరిపెన్నా అని కానీ.. బనకచర్ల అనే పదం కానీ ప్రస్తావనకు వచ్చిందా? ఎందుకు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు రేవంత్‌రెడ్డీ? ప్రస్తుతం తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీలు కాకుండా.. సముద్రంలో కలుస్తున్న 3,000 టీఎంసీల్లో మరో 1,950 టీఎంసీల నీళ్లను కూడా.. అంటే మొత్తంగా 2,918 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని కోరుతూ 2.10.2020న కేంద్ర జలవనరుల మంత్రి శెఖావత్‌కు కేసీఆర్ లేఖ రాశారు. నదీ మార్గంలో నీళ్లు తేవాలనే ప్రతిపాదనను ఆనాడు కేసీఆర్.. జగన్ ముందు ఉంచితే.. అది కాదని ఏపీ భూభాగం వెంట నీళ్లను తరలించే ప్రయత్నం చేశారు. ఈ విషయంపై కేసీఆర్ ఆదేశాల మేరకు నేనే స్వయంగా 2022లో దిల్లీకి వెళ్లి కేంద్రమంత్రి శెఖావత్‌కు లేఖ ఇచ్చి.. గోదావరిపెన్నా లింక్‌ను అడ్డుకోవాలని కోరా. జులై 14, 2014న కృష్ణాలో 581 టీఎంసీలు మాకు కావాలని, కొత్త ట్రైబ్యునల్ వేసి.. నదీ పరీవాహక ప్రాంతం ఆధారంగా నీటి కేటాయింపులు జరపాలని 22 పేజీల లేఖ రాశాం. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసి తెలంగాణ నీటి ప్రయోజనాలు దెబ్బతీశారు. ముఖ్యమంత్రి మాదిరిగానే.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు" అని హరీశ్‌రావు మండిపడ్డారు. హైదరాబాద్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు విజయవాడ దైవ దర్శనానికి వెళ్లి, ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన అంశాన్ని బనకచర్ల ప్రాజెక్టుతో ముడిపెడుతూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 2016లో భారాస హయాంలోనే బనకచర్లకు పునాది పడిందన్న వాస్తవాన్ని కప్పిపుచ్చుకునేందుకు హరీశ్‌రావు ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని బుధవారం ఆయనొక ప్రకటనలో మండిపడ్డారు.

మొదటి పేజీ తరువాయి

# 'ముసురు'కున్న ట్రాఫిక్...




వాహనాలతో నిండిపోయిన కొండాపూర్ ఫ్లై ఓవర్



ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్డుపై బారులు తీరిన కార్లు



ట్రాఫిక్ జామ్ లో ఐటీ కారిడార్ రహదారులు



నాలెడ్జ్ సిటీలో నిలిచిపోయిన వాహనాలు



ట్రాఫిక్ జామ్ లో ఐటీ కారిడార్ రహదారులు

**రోజంతా స్వల్ప ముసురు... పెద్ద ఎత్తున రోడ్లపైకి కార్లు..**

**ఐటీ కారిడార్ లో ట్రాఫిక్ తిప్పలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఐటీ కారిడార్ కు ట్రాఫిక్ కష్టాల గ్రహణం వీడడం లేదు. ముఖ్యంగా వర్షం పడిన రోజు కొత్త కష్టాలు ఏర్పడుతున్నాయి. చినుకు పడిందంటే పెద్ద ఎత్తున రహదారుల పైకి చేరుతున్న ఫోర్ వీలర్ వాహనాలతో ట్రాఫిక్ తిప్పలు పెరుగుతున్నాయి. ఐటీ కారిడార్ లోని కొన్ని రహదారులు నిత్యం ట్రాఫిక్ చక్రబంధంతో వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తుండగా చినుకు పడిందంటే వాహనదారుల కష్టాలు మరింత పెరుగుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో నగరాన్ని ప్రపంచ పటంలో నిలుపుతున్న గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రహదారులను ఎంతగా విస్తరించినా.. ఫ్లై ఓవర్లు నిర్మించినా.. అండర్ పాస్ లు తెరిచినా... ట్రాఫిక్ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. చిన్న వర్షం పడిందంటే వాహనదారులు గంటలకు గంటలు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా వర్షం పడిందంటే ఐటీ ఉద్యోగులు చాలావరకు తమ కార్లతో రోడ్లపైకి వస్తుండడంతో వర్షాలు పడిన రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రతరం అవుతున్నాయి. సాధారణ రోజుల్లో ప్రజా రవాణా, టూవీలర్ వాహనాలను ఉపయోగించే వారు సైతం వర్షం పడిన రోజు తమ కార్లను బయటకు తీస్తున్నారు. దీంతో ఐటీ కారిడార్ రహదారులపై రద్దీ పెరిగి తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పెద్ద ఎత్తున రహదారుల పైకి వస్తున్న ఫోర్ వీలర్ వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుండగా, ట్రాఫిక్ పోలీసులు సైతం ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు. బుధవారం రోజంతా కురిసిన సాధారణ మూసురు ఐటీ కారిడార్ రహదారులను ట్రాఫిక్ వలయంలో ముంచింది. కొండాపూర్ ఫ్లైఓవర్ మొత్తం మధ్యాహ్నం 1గంట సమయంలో సైతం వాహనాలతో నిండిపోగా, ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు వాహనాల బారులతో కిక్కిరిసిపోవడం ట్రాఫిక్ సమస్యను కళ్లకు కట్టింది. దీంతోపాటు రాయదుర్గం, మాదాపూర్, లింగంపల్లి, హెచ్సీయూ రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు గంటల కొద్ది ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రహదారులు గుంతలమయం కావడం, కొన్ని రహదారులు విస్తరణకు నోచుకోకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలు పడిన రోజుల్లో ఐటీ కారిడార్ పరిధిలో ఉన్న కార్యాలయాలు తమ టైమింగ్ మార్చుకోవాలని, అన్ని కార్యాలయాలు ఒకే టైం లో ఉద్యోగులను వదలకుండా సమయాన్ని మార్చుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

**తద్వారా ఒకేసారి వాహనాలు రహదారుల పైకి రాకుండా నిరోధించవచ్చని అంటున్నారు. దీంతోపాటు కార్ పూలింగ్ పై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ఉద్యోగులను అలవాటు చేయాలంటున్నారు.**

# మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను కలిసిన రవీందర్ యాదవ్



వై ఎస్ జగన్ తో రవీందర్ యాదవ్

**సోషియో కల్చరల్ అకాడమీ సేవలపై అభినందన**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, యువనేత రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని వైసీపీ కార్యాలయంలో వైఎస్ జగన్ ను కలిసిన రవీందర్ యాదవ్ పలు విషయాలపై చర్చించారు. రవీందర్ యాదవ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేదల కోసం రవీందర్ యాదవ్ చేస్తున్న కృషిని జగన్ అభినందించారు. తెలంగాణ సోషియో కల్చరల్ అకాడమీ ఛైర్మన్ గా రవీందర్ యాదవ్ పేదలు, అనాథలు, స్కూల్ విద్యార్థులకు చేస్తున్న సేవలను, చేయడమే కాకుండా విపత్తులు సమయంలో స్పందిస్తున్న తీరుపై వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. రాష్ట్రం కోసం ఉద్యమ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కేసీఆర్ పాలనలోనే నిజమైన అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దేనని పేర్కొన్నారు.

# బెట్టింగ్ లో డబ్బు పోగొట్టిన కుమారుడిని మందలించిన తండ్రి

**కక్షతో తండ్రిని పొడిచి చంపిన కుమారుడు**

**ఆత్మహత్యగా చిత్రీకరించి దాహణసంస్కారాలు చేసే యత్నం**

**గచ్చిబౌలి పోలీసుల రంగ ప్రవేశం - బయటపడ్డ హత్య కోణం**

ఈకబురు, శేరిలింగంపల్లి : బెట్టింగ్ యాప్ ల కారణంగా ఆత్మహత్యలే కాదు... హత్యలు చోటు చేసుకుంటున్నాయి. బెట్టి యాప్ లలో డబ్బులు పోగొట్టుకున్న యువత కుటుంబ సభ్యుల మీదే కత్తులు దూస్తున్నారు. తాజాగా గోపనపల్లిలో చోటు చేసుకున్న సంఘటన హృదయ విదారకంగా ఉంది. బెట్టింగ్ యాప్ లో డబ్బులు పోగొట్టిన కుమారుడిని మందలించినందుకు తండ్రి మీద కక్ష పెంచుకున్న ఓ కుమారుడు కన్న తండ్రినే దారుణంగా హత్య చేశాడు. హత్య అనంతరం తండ్రి మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించి.. మృతదేహాన్ని బంధువులతో కలిసి సొంత ఊరికి దాన సంస్కారాల కోసం తరలించాడు. గచ్చిబౌలి పోలీసుల రంగ ప్రవేశంతో కుమారుడి పన్నాగం బెడిసి కొట్టగా, హత్య ఉదాంతం వెలుగులోకి వచ్చింది. తండ్రిని హత్య చేసిన కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి..

వనపర్తి జిల్లా ఘనపూర్ మండలం కోతుల గుట్ట గ్రామానికి చెందిన కేతావత్ హనుమంతు(37) బ్రతుకు తెరువు కోసం కుటుంబంతో కలిసి నగరానికి వలస వచ్చాడు. భార్య జమ్ములమ్మ, ఇద్దరు కుమారులు కేతావత్ రవీందర్ (19), సంతోష్ లతో కలిసి గోపనపల్లి పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటూ స్థానికంగా మేస్త్రీగా పని చేస్తున్నాడు. కాగా అవసరాల కోసం ఆస్తులు బ్యాంకులో తనకా పెట్టిన హనుమంతు 6 లక్షల రూపాయల లోన్ తెచ్చాడు. ఇంటర్మీడియట్ చదివి ఖాళీగా ఉంటూ జల్సాలకు అలవాటు పడిన పెద్ద కుమారుడు రవీందర్ సదరు 6 లక్షల లోన్ డబ్బును బెట్టింగ్ యాప్ లో పోగొట్టాడు. ఈ విషయమై తండ్రి, కొడుకుల మధ్య గొడవ జరగగా కుమారుడిని హనుమంతు తీవ్రంగా మందలించాడు. దీంతో తండ్రిపై కక్ష పెంచుకున్న రవీందర్ హత్య చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా 1వ తేదీన మధ్యాహ్నం గోపనపల్లి పరిధిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తండ్రిని తీసుకువెళ్లి కత్తితో దాడి చేసి, గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. హత్య అనంతరం గోపనపల్లిలోనే ఉంటున్న తన బాబాయి రమేష్ కు ఫోన్ చేసి తండ్రి కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడు. రవీందర్ మాటలు నమ్మిన కుటుంబ సభ్యులు, బంధువులు హనుమంతు మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం సొంత ఊరు కోతుల గుట్టకు తరలించారు.

**గచ్చిబౌలి పోలీసుల అనుమానం...**

ఓవైపు హనుమంతు దహన సంస్కారాలను బుధవారం నిర్వహించేందుకు కోతులగుట్టలో కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగా.. మరోవైపు హనుమంతు మరణ వార్త గచ్చిబౌలి పోలీసులకు తెలిసింది. హనుమంతు ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేసిన గచ్చిబౌలి పోలీసులు ఘనపూర్ పోలీసులకు సమాచారం అందించారు. హనుమంతు మృతిపై కేసు నమోదు చేయాలని, లేదంటే తామే కేసు నమోదు చేస్తామని గచ్చిబౌలి పోలీసులు తేల్చి చెప్పారు. కోతుల గుట్ట గ్రామ పెద్దలతో మాట్లాడి అంత్యక్రియలు నిర్వహిస్తే అందరి మీద కేసు నమోదవుతుందని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఘనపూర్ పోలీసులు మృతదేహాన్ని తిరిగి గచ్చిబౌలికి పంపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కుమారుడు రవీందర్ ను అదుపులోకి తీసుకొని విచారించగా, తన తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో రవీందర్ ను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



కుమారుడి చేతిలో దారుణ హత్యకు గురైన హనుమంతు (ఫైల్)

# శేరిలింగంపల్లిలో మొదటి ఇందిరా మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రం



కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



కేంద్రంలో కుట్టు మిషన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**నల్లగండ్లలో ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ**

**ఎమ్మెల్యే సొంత డబ్బుతో 5 కుట్టు మిషన్లు అందజేత**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో మొట్టమొదటి ఇందిరా మహిళా శక్తి కుట్టుమిషన్ కేంద్రం బుధవారం ప్రారంభమైంది. నియోజకవర్గ పరిధిలోని నల్లగండ్లలో నల్లగండ్ల 1 మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కుట్టు మిషన్ కేంద్రాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ తన సొంత డబ్బుతో 5 కుట్టుమిషన్లను కొనుగోలు చేసి ఇందిరా మహిళా శక్తి కేంద్రానికి అందజేశారు. అనంతరం మహిళ సమైక్య అధ్యక్షురాలు వీణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొట్టమొదటి ఇందిరా మహిళా శక్తి కుట్టు కేంద్రంను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తనవంతు సహాయంగా స్వంత ఖర్చుతో ఐదు కుట్టుమిషన్లను అందజేస్తున్నానని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క మహిళా స్వయం సహాయక సంఘాలలో చేరి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే సదుపాయం ఉందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన గొప్ప పథకం ఇందిరా మహిళ శక్తి పథకమని అన్నారు. శేరిలింగంపల్లిలో మహిళా సాధికారతకు కృషి చేస్తానని స్వయం సహాయక సంఘాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, శేరిలింగంపల్లి యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగమల్లేశ్వరి, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మంత్రిప్రగఢ సత్యనారాయణ, ఇబ్రహీం, విష్ణువర్ధన్ రెడ్డి ,సురేష్ నాయక్, ప్రభాకర్ రెడ్డి,రాజేందర్, ఖాజా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు

ఈ కబురు: ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మరోసారి దూకుడు పెంచారు. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ నివాసాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి ఆయన ఆఫీసులు, నివాసాల్లో దాడులు చేస్తున్నారు. శివబాలకృష్ణతో పాటు ఆయన సోదరుడు నవీన్ కుమార్ నివాసంలోనూ సోదాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో శివబాలకృష్ణ సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

శివ బాలకృష్ణ గతంలో మెట్రో రైల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా, రెరా ఇంచార్జి కార్యదర్శిగా కూడా పని చేశారు. ఏసీబీ కేసుల నేపథ్యంలో శివబాలకృష్ణను హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ సస్పెండ్ చేశారు. ఇప్పటికే శివబాలకృష్ణ బంధువుల పేరిట 214 ఎకరాల వ్యవసాయ భూములు రిజిస్టర్ అయినట్టు తేలిందని ఏసీబీ అధికారులు తెలిపారు. జనగామ జిల్లాలో 102, యాదాద్రి భువనగిరి జిల్లాలో 66, నాగర్‌కర్నూల్ జిల్లాలో 38, సిద్దిపేటలో 7 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు వెల్లడించారు. శివబాలకృష్ణ అక్రమాల వెనుక హెచ్ఎండీఏ, మెట్రోరైల్ అధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.




# యూఎస్ కాన్సులేట్ ముందు ఏఐవైఎఫ్ ఆందోళనకు యత్నం

**అడ్డుకున్న పోలీసులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం గచ్చిబౌలిలోని యూఎస్ కాన్సులేట్ ముందు ఆందోళనకు ప్రయత్నించారు. ఛలో అమెరికన్ కాన్సులేట్ పేరుతో ముట్టడికి ప్రయత్నించగా ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి గచ్చిబౌలి పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ దివాళా కోరు ఉగ్రవాద ప్రేరేపిత దేశం పాకిస్తాన్ కు అమెరికా రెడ్ కార్పెట్ వేస్తూ తన సామ్రాజ్యవాద విష పోకడలను అనుసరిస్తుందని ధ్వజమెత్తారు. ఔర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్ అంటూ అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో మోడీ పాల్గొని భారతీయులతో మీటింగ్ ఏర్పాటు చేసి ట్రంప్ ను గెలిపించాలని కోరడం సిగ్గు చేటు అన్నారు. అనంతరం ఎన్నికల్లో గెలిచిన ట్రంప్ భారతీయులపై తన కర్కషాన్ని ప్రదర్శించాడన్నారు.ఇటీవల కాలంలో జరిగిన భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ నిసిగ్గుగా మీడియాకు చెప్పినా, మోడీ ఖండించలేదన్నారు. వ్యాపార దృక్పథంతో మాత్రమే ట్రంప్ ఆలోచిస్తున్నాడు తప్ప, భారత్ తో స్నేహ సంబంధం పచ్చి మోసం,దగా అని అన్నారు. ట్రంప్ భారత్ కు చేస్తున్న దుర్మార్గాలను నరేంద్ర మోదీ ఖండించకుండా, 140కోట్ల ప్రజల సార్వభౌమత్వాన్ని, సమగ్రతను తాకట్టు పెడుతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మార్కపురి సూర్య, ఆరెపల్లి మానస్ కుమార్, జనగాం రాజకుమార్, ఎత్తం మహేష్, నాయకులు కల్లపల్లి నవీన్, రాజు పాల్గొన్నారు.




ఆందోళన చేపట్టేందుకు ప్రయత్నించిన వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

# రద్దీ ఉంటే రేట్లు పెంచుకోవచ్చు..
# క్యాబ్ సంస్థలకు కేంద్రం పచ్చజెండా

యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్, ఓలావంటి సంస్థలకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రద్దీ ఉంటే రేట్లు పెంచుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈమేరకు మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసింది.

కొత్త నిబంధనల ప్రకారం నామమాత్రంగా రద్దీ ఉన్న సమయాల్లో బేస్ ఛార్జీల్లో సగం సర్‌ఛార్జీ కింద పెంచుకునేందుకు వీలు కల్పించింది. అలాగే ఒకవేళ రద్దీ విపరీతంగా ఉంటే 200 శాతం పెంచుకునేందుకు అనుమతిచ్చింది. అంతకుముందు ఈ వెలుసుబాటు 150 శాతంగా ఉండేది. ఇక, మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణానికి ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదన్న షరతు విధించింది.

యాప్ ద్వారా రైడ్‌ను అంగీకరించిన తర్వాత సరైన కారణం చెప్పకుండా డ్రైవర్ క్యాన్సిల్ చేస్తే.. ఛార్జీలో 10 శాతం పెనాల్టీ (రూ.100 మించకుండా) పడుతుంది. దానిని డ్రైవర్, అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ (ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలు) చెరి సమానంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ, సరైన కారణం చెప్పకుండా ప్రయాణికులు రైడ్ క్యాన్సిల్ చేసినా ఇదే పెనాల్టీ వర్తిస్తుంది. అలాగే కేంద్రం డ్రైవర్ల సంక్షేమంపై ప్రధానంగా దృష్టిసారించింది. ఈ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లతో అనుబంధంగా ఉన్న ప్రతి డ్రైవర్‌కు కనీసం రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల మేర టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజ్‌ను ఆ క్యాబ్ సంస్థలు తప్పనిసరిగా అందించాలని పేర్కొంది. అలాగే ఈ వేదికల ద్వారా ప్యాసింజర్ రైడ్స్ కోసం ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి అనుమతించింది.

ఇటీవల కర్ణాటక వ్యాప్తంగా బైక్ ట్యాక్సీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటూ కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 15 వరకు గడువు ఇచ్చింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయగా.. డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. దాంతో వాటి సేవలు నిలిచిపోయాయి. బైక్ ట్యాక్సీలపై నిషేధం వల్ల గిగ్‌వర్కర్ల జీవితాలు రోడ్డునపడతాయంటూ తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఆటోలు, బైక్ ట్యాక్సీలు, సహా ఇతర వాహనాలకు బేస్ ఛార్జీలను నిర్ణయించే అధికారాన్ని కేంద్రం రాష్ట్రాలకు అందించింది. ఒకవేళ రాష్ట్రాలు బేస్ ఛార్జీలను అధికారికంగా నోటిఫై చేయకపోతే.. ఆ ధరలను ప్రకటించే బాధ్యత అగ్రిగేటర్లదేనని వెల్లడించింది. అలాగే ఆ వివరాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాలని చెప్పింది.

ఇక డ్రైవర్ పికప్‌పాయింట్‌కు చేరుకోవడానికి ప్రయాణించే దూరం అంటే డెడ్ మైలేజ్‌కు ఛార్జీ విధించకూడదని మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే పికప్ పాయింట్ మూడు కిలోమీటర్ల కంటే తక్కువ దూరం ఉన్నప్పుడే ఈ మినహాయింపు వర్తిస్తుంది. అలాగే ప్రయాణికుల భద్రతను నిర్ధరించేందుకు ఈ క్యాబ్ సంస్థల కింద సేవలు అందించే వాహనాలకు వెహికిల్ లొకేషన్, ట్రాకింగ్ పరికరాలు అమర్చడాన్ని తప్పనిసరి చేసింది. ఈ డేటా ఫీడ్.. ఆ సంస్థలతో పాటు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లకు అందుబాటులో ఉండాలి. దాంతో అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందనకు వీలు కలుగుతుందని పేర్కొంది.




# ఒక్కసారి ఛార్జ్ చేస్తే 159 కి.మీ రేంజ్

భారత ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్‌లో సర్వీసులు అందిస్తున్న ఏథర్ ఎనర్జీ 3.7 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో రిజ్టా ఎస్ మోడల్‌ను విడుదల చేసింది. మెరుగైన బ్యాటరీ వల్ల ఒక్కసారి ఛార్జ్ చేస్తే 159 కిలోమీటర్ల రేంజ్ వరకు ప్రయాణం చేయవచ్చని కంపెనీ తెలిపింది. రూ.1,37,047 ఎక్స్ షోరూమ్ ధరతో దీన్ని విపణిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది.

**ఫీచర్లు ఇవే..**3.7 కిలోవాట్ల లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌తో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 159 కి.మీ సామర్థ్యం ఉంటుంది.ఓవర్ నైట్ హోమ్ ఛార్జింగ్, ఏథర్ గ్రిడ్ ఫాస్ట్ ఛార్జింగ్ వేరియంట్‌ల్లో లభిస్తుంది. ఏడు అంగుళాల డీప్ వ్యూ డిస్ప్లే టెక్నాలజీ అందిస్తున్నారు. థెఫ్ట్ అలర్ట్స్, ఫైండ్ మై స్కూటర్, అలెక్సా ఇంటిగ్రేషన్ వంటి సాంకేతికత ఇందులో ఉందని కంపెనీ తెలిపింది.ఓటీఏ(ఓవర్‌దిఎయిర్) అప్‌డేట్‌లు ఎనేబుల్ చేయవచ్చని పేర్కొంది. 34 లీటర్ల అండర్ సీట్ స్పేస్ ఉంటుందని చెప్పింది.



# మస్క్ కంపెనీలో ఉద్యోగం కావాలా?



ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ కంపెనీ ఎక్స్ఏఐలో నియామకాలు జోరుగా సాగుతున్నాయి. బ్యాకెండ్ ఇంజినీర్లు, ప్రొడక్ట్ డిజైనర్లు, డేటా సైంటిస్టులు, లీగల్ ఎక్స్‌పర్ట్‌లు.. వంటి ఉద్యోగాల కోసం ఎక్స్ఏఐ తన ఎక్స్ ఖాతాలో ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం పాలో ఆల్టో, శాన్ ఫ్రాన్సిస్కో, మెంఫిస్‌లోని కార్యాలయాల్లో విస్తృత శ్రేణి ఉద్యోగాలను భర్తీ చేయాలని చూస్తోంది. కొన్ని పోస్టులు రిమోట్ దరఖాస్తుదారులకు కూడా అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్ మనీ'ని అభివృద్ధి చేయడానికి చురుకుగా పనిచేస్తున్నట్లు ఎక్స్ఏఐ తెలిపింది.

ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్ష ప్రయాణాలు, సామాజిక మాధ్యమాల్లో తనదైన ముద్ర వేసిన తర్వాత మస్క్ తన ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ఆర్థిక సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఫీచర్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఎక్స్ యూజర్లు ప్లాట్‌ఫామ్ నుంచి బయటకు వెళ్లకుండా షాపింగ్, టిప్పింగ్, మనీ మేనేజ్‌మెంట్.. వంటి మరెన్నో లావాదేవీలను నిర్వహించేందుకు వీలు కల్పించేలా సమగ్ర ఆర్థిక ఎకోసిస్టమ్‌ను రూపొందించమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రణాళికలో భాగంగా ఎక్స్ బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డులను త్వరలో విడుదల చేయాలని భావిస్తున్నారు. ముందుగా యూఎస్‌లో ఈమేరకు మార్పులు చేయబోతున్నట్లు అధికార వర్గాలు గతంలో తెలిపాయి. క్రమంగా ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పాయి.

**ఇప్పటికే 'వీసా'తో ఒప్పందం**

వీసా సంస్థ ఇప్పటికే ఈమేరకు ఎక్స్ ప్లాట్‌ఫామ్ మొదటి చెల్లింపుల భాగస్వామిగా సంతకం చేసింది. ఎక్స్ మనీ సేవలో డిజిటల్ వాలెట్, పీర్ టుపీర్ పేమెంట్ ఫంక్షన్లు ఉంటాయి. వీటి ద్వారా ఎక్స్‌లో వినియోగదారులు కొనుగోళ్లు చేయవచ్చు. వాలెట్‌లో మనీ నిల్వ చేసుకోవచ్చు. 'మీరు ఎక్స్‌లోకి వెళ్లి మీ ఆర్థిక లావాదేవీలన్నింటినీ నిర్వహించగలరు' అని ఎక్స్ సీఈఓ లిండా యాకారినో కేన్స్ లయన్స్ గతంలో ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ క్రియేటివిటీలో పేర్కొన్నారు.

**వేతనాలు ఇలా..**

ఎక్స్ఏఐలో చేరే ఉద్యోగులకు ఏటా 2,20,000 డాలర్ల (సుమారు రూ.1.9 కోట్లు) నుంచి 4,40,000 డాలర్ల (సుమారు రూ.3.7 కోట్లు) వరకు పారితోషికం ఆఫర్ చేసింది. డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, సెక్యూర్ ట్రాన్సాక్షన్స్ వంటి రంగాల్లో బలమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, సంక్లిష్టమైన ఆలోచనలను స్పష్టంగా కమ్యూనికేట్ చేసే సామర్థ్యం ఉన్న ఇంజినీర్లకు కంపెనీ మరింత చెల్లిస్తుందని ఎక్స్ఏఐ తెలిపింది.

# అనిల్ అంబానీకి ఎస్‌బీఐ 'ఫ్రాడ్' ట్యాగ్..
# ఒకప్పుడు బిలియనీర్.. ఇప్పుడు మోసగాడా?

అన్న ముఖేష్ అంబానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా తిరుగులేని సామ్రాజ్యాన్ని నిర్మించగా.. తమ్ముడు అనిల్ అంబానీ మాత్రం అప్పుల ఊబిలో కూరుకుని నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. గతంలో వ్యాపార రంగంలో తన అద్భుతమైన తెలివితేటలు, సామర్థ్యంతో ప్రపంచ అత్యంత ధనవంతుల జాబితాలో చోటు దక్కించుకున్న అనిల్ అంబానీ ఇప్పుడు బ్యాంకుల్ని మోసం చేసిన మోసగాళ్ల జాబితాలో చేరినట్టు పలు నివేదికలు చెబుతున్నాయి.ప్రముఖ వ్యాపార వేత్త అనిల్ అంబానీకి ఎస్‌బీఐ షాకిచ్చింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భారీ ఎత్తున రుణాలిచ్చింది. ఆ రుణాల్ని రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కాం) నిబంధనలకు విరుద్ధంగా నిధుల్ని మళ్లించినట్లు గుర్తించింది. ఫలితంగా బ్యాంకుల్ని మోసం చేసిన సంస్థల జాబితాలో రిలయన్స్ కమ్యూనికేషన్‌తో పాటు ఆ సంస్థ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీ పేరును సైతం చేర్చింది. ఎస్‌బీఐ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కి ఇచ్చిన రుణాల్లో నిబంధనల ఉల్లంఘన, నిధుల దుర్వినియోగం వంటి అంశాలు కనిపించాయని పేర్కొంది. మొత్తం రూ.31,580 కోట్ల రుణాల్లో సుమారు రూ.13,667 కోట్లు ఇతర రుణాల చెల్లింపులకు, రూ.12,692 కోట్లు సంబంధిత సంస్థలకు మళ్లించారని తెలిపింది.

ఈ నేపథ్యంలో, ఎస్‌బీఐ జూన్ 23న కంపెనీకి లేఖ రాసింది. సంస్థ ఖాతాల్ని 'ఫ్రాడ్'గా గుర్తిస్తున్నట్లు సమాచారం అందించింది. అనిల్ అంబానీ పేరును కూడా చేర్చినట్లు ఆర్‌బీఐకి నివేదించింది. అయితే, అనిల్ అంబానీ తరఫు న్యాయవాదులు ఈ నిర్ణయంపై స్పందించారు. తాము సమర్పించిన వివరణలకు ఎస్‌బీఐ సరైన స్పందన ఇవ్వలేదని ఆరోపించారు. ఇదే విషయంలో అనిల్ అంబానీ సంస్థలకు రుణాలు ఇచ్చిన ఇతర బ్యాంకుల్ని సైతం ఎస్‌బీఐ సంప్రదించనుంది. ఇప్పటికే కెనరా బ్యాంక్ కూడా ఆర్‌కామ్ అకౌంట్లను ఫ్రాడ్‌గా గుర్తించింది.

కాగా, బ్యాంకులు ఏదైనా సంస్థకు రుణాలిచ్చి.. వాటిని చెల్లించే క్రమంలో లేదంటే ఇతర అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే వాటిని ఫ్రాడ్ జాబితాలో చేర్చుతాయి. ఆ జాబితాలో పేరుంటే సదరు సంస్థలకు 5 సంవత్సరాల పాటు కొత్త రుణాలు ఇవ్వకూడదు. ఇది అన్ని బ్యాంకులకు వర్తించే నిబంధన. తాజాగా ఆర్‌కామ్ విషయంలో సైతం ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయం ఇతరు బ్యాంకులు తీసుకునేలా సంప్రదింపులు జరపనున్నట్లు తెలుస్తోంది. ఇక డ్రైవర్ పికప్‌పాయింట్‌కు చేరుకోవడానికి ప్రయాణించే దూరం అంటే డెడ్ మైలేజ్‌కు ఛార్జీ విధించకూడదని మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే పికప్ పాయింట్ మూడు కిలోమీటర్ల కంటే తక్కువ దూరం ఉన్నప్పుడే ఈ మినహాయింపు వర్తిస్తుంది. అలాగే ప్రయాణికుల భద్రతను నిర్ధరించేందుకు ఈ క్యాబ్ సంస్థల కింద సేవలు అందించే వాహనాలకు వెహికిల్ లొకేషన్, ట్రాకింగ్ పరికరాలు అమర్చడాన్ని తప్పనిసరి చేసింది. ఈ డేటా ఫీడ్.. ఆ సంస్థలతో పాటు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లకు అందుబాటులో ఉండాలి. దాంతో అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందనకు వీలు కలుగుతుందని పేర్కొంది.



# మిడిల్‌క్లాస్‌కు త్వరలో మరో ఊరట..
# ఈ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు?

ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు అమాంతం పెంచి మధ్యతరగతికి ఊరట కల్పించిన కేంద్రం మరో గుడ్‌న్యూస్ చెప్పేందుకు సిద్ధమవుతోంది. మధ్య తరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని చూస్తోంది. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా 12 శాతంలో ఉన్న చాలావరకు వస్తువులను 5 శాతం ట్యాక్స్ శ్లాబ్ పరిధిలోకి తీసుకురావడమో చేయాలని కేంద్రం చూస్తోంది. తద్వారా వారిపై భారం తగ్గించాలని భావిస్తోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి.

పేద, మధ్యతరగతి ఎక్కువగా వినియోగించే టూత్‌పేస్టు, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టుమిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంటగదిలో వినియోగించే పాత్రలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషిన్లు, సైకిళ్లు, రూ.1000 పైబడిన రెడీమేడ్ దుస్తులు, ఫుట్‌వేర్, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గించాలని భావిస్తున్న వస్తువుల జాబితాలో ఉన్నాయి. ప్రతిపాదిత వస్తువులపై జీఎస్టీ తగ్గిస్తే అవి తక్కువ ధరకే పేద, మధ్యతరగతి వర్గాలకు లభిస్తాయి.కేంద్రం తీసుకోబోయే ఈ నిర్ణయం వల్ల ఖజానాపై రూ.40వేల నుంచి రూ.50వేల కోట్ల వరకు భారం పడుతుందని అంచనా. అయితే, ఆయా ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించడం ద్వారా వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. పన్ను పరిధి పెరగడంతో పాటు దీర్ఘకాలంలో జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దిగువ, మధ్య తరగతికి ఊరట కల్పించే దిశగా జీఎస్టీ రేట్లు హేతుబద్ధీకరించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడం గమనార్హం. ఈ నిర్ణయాలు తీసుకోవాలంటే జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం సాధించాల్సి ఉంటుంది. ఈ నెలాఖరులో జీఎస్టీ మండలి సమావేశం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.




# మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు..
# 9 వేల మందికి నోటీసులు!

టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. వేలాది మందికి లేఆఫ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కొన్ని నెలల వ్యవధిలోనే ఈ స్థాయి లేఆఫ్‌లు ప్రకటించడం ఇది రెండోసారి. అయితే, ఈసారి ఎంతమందిపై వేటు పడనుందనే విషయాన్ని స్పష్టంగా చెప్పనప్పటికీ.. దాదాపు నాలుగు శాతం కంటే తక్కువ ఉద్యోగులపై ప్రభావం చూపనుందని తెలిపింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం దాదాపు 9 వేల మందికి లేఆఫ్‌లు ఇచ్చినట్లు సమాచారం.

జూన్ 2024 నాటికి 2.28 లక్షల మంది ఉద్యోగులు మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్నారు. భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపులను మొదలుపెట్టిన టెక్ దిగ్గజం.. ఈ ఏడాది మే నెలలో 6 వేల మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. తాజాగా మరోసారి పెద్దఎత్తున తొలగింపునకు సిద్ధమైంది. తాజా నిర్ణయంతో మొత్తం సిబ్బందిలో నాలుగు శాతం.. అంటే దాదాపు 9100 మంది ఉద్యోగులపై ప్రభావం పడనున్నట్లు అంచనా.



# అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని మరెవరూ టచ్ చేయలేరు..తేల్చేసిన టాప్ డైరెక్టర్



పుష్ప2 సినిమా అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని ఆకాశానికి చేర్చిందనేది తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనేక మంది టాప్ స్టార్స్ ఉండగా ఒక్కసారిగా వీరందరినీ మన బన్నీ దాటేశాడు. తన తదుపరి సినిమాకి ఏకంగా రూ.300కోట్ల రెమ్యునరేషన్ అందుకుంటున్నాడనే వార్త టాప్ బాలీవుడ్ స్టార్స్‌కి కూడా దిమ్మదిరిగిపోయేలా షాక్ ఇచ్చింది. ఓ వైపు ఎంతో కాలంగా ఇంటర్నేషనల్ స్టార్స్‌గా వెలుగొందుతున్న ఎందరో బాలీవుడ్ హీరోలు, మరోవైపు ఇటీవలే గ్లోబల్ స్టార్స్‌గా మారిన దక్షిణాది హీరోలు.. మరి వీరందరిలో భవిష్యత్తులో బన్నీని బీట్ చేయగల హీరో ఎవరు? అనే ప్రశ్నలు చర్చలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని బీట్ చేయడం ఇప్పట్లో మరెవరికీ సాధ్యం కాదు ఓ టాప్ డైరెక్టర్ తేల్చేయడం విశేషం.

ఆయన కూడా సాదా సీదా హిందీ సినిమాల దర్శకుడేమీ కాదు అనేక హిట్ చిత్రాలు అందించిన అగ్రగామి బాలీవుడ్ దర్శకుడు మధర్ భండార్కర్. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ అభిప్రాయం వ్యక్తం చేయడం సంచలనంగా మారింది. ''సమీప రోజుల్లో, ఎవ్వరూ కూడా అల్లూ అర్జున్ దక్కించుకున్న క్రేజ్‌ను కనీసం తాకలేరు. ఆయన నిజమైన పాన్‌ఇండియా స్టార్'' అని మధుర్ భండార్కర్ అన్నారు. అంతేకాదు.. పుష్ప సినిమా కోసం అల్లు అర్జున్ ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన తీరు. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ భారీగా మాస్ ఆకర్షణను సంపాదించి పెట్టిందని ప్రాంతాలకతీతంగా అల్లు అర్జున్‌ను ప్రేక్షకులతో కనెక్ట్ చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు.

పుష్ప సినిమా విజయం గతంగా మారిపోయినా ఇప్పటికీ అల్లు అర్జున్‌ను ప్రశంసిస్తున్న వారి జాబితా అంతకంతకూ పెరిగిపోతుండడం విశేషం. బన్నీని ఆకాశానికి ఎత్తేస్తున్న బాలీవుడ్ ప్రముఖుల్లో మధుర్ భండార్కర్ మాత్రమే కాదు అల్లు అర్జున్ మాత్రమే పుష్ప చేగలడంటూ బాలీవుడ్ టాప్ హీరో హృతిక్ రోషన్ అన్నాడు. అతని ఎనర్జీ ఎక్స్‌ట్రార్డినరీ అంటూ యువ హీరో కార్తీక్ ఆర్యన్ పొగిడితే...ఐకాన్‌స్టార్‌తో ఒక్కసినిమాలో అయినా నటించాలని ఉందని బాలీవుడ్ నటి అనన్య పాండే తపిస్తున్నారు.

అతని లాంటి డ్యాన్సర్‌ని చూడలేదని టాప్ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్ తేల్చేశారు. ఆయన ఎనర్జీ మరెవరికీ సాధ్యం కాదు అని బాలీవుడ్‌లో ఎనర్జిటిక్ హీరోగా పేరున్న షాహిద్ కపూర్ ఒప్పేసుకున్నాడు. అతనో స్టైల్ ఐకాన్ అంటూ మరో బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌లు...అభివర్ణించాడు. ఇలా ఎందరో బన్నీపై భారీ స్థాయిలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న అల్లు అర్జున్ అట్లీల సినిమా పై అంచనాలను వీరి అభిప్రాయాలు మరింతగా పెంచేస్తున్నాయనేది నిజం. ఈ నేపథ్యంలో ఆ స్థాయి అంచనాలను అందుకోవడానికి బన్నీ అట్లీ ద్వయం మరింతగా కృషి చేయకతప్పదు.

# 'పీఆర్ స్టంట్స్ చేసేవారికే సక్సెస్..' పరోక్షంగా పూనమ్ కౌర్ ట్వీట్!




టాలీవుడ్ నటి పూనమ్ కౌర్ మరోసారి వార్తల్లో నిలిచింది. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై ఆరోపణలతో టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన పూనమ్ మరో ట్వీట్ చేసింది. ఒరిజినల్ కంటెంట్, స్క్రిప్ట్ ఉన్న దర్శకుడు క్రిష్ అంటూ కొనియాడింది. ఎన్నో కాపీరైట్ సమస్యలు, పీఆర్ స్టంట్‌లు ఉన్న దర్శకుడికి వచ్చినంత గుర్తింపు, విజయం లభించడం లేదని రాసుకొచ్చింది. ఈ ట్వీట్ చూస్తే మరోసారి త్రివిక్రమ్‌ను ఉద్దేశించే పరోక్షంగా పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. అయితే పవన్ కల్యాణ్ మూవీ హరిహర వీరమల్లు ట్రైలర్ రిలీజ్‌కు ముందు పూనమ్ చేసిన ట్వీట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఈ నెలలోనే రిలీజ్ కానుందని వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మేకర్స్ ట్రైలర్ రిలీజ్ తేదీని ప్రకటించారు. ఈనెల 3న ఉదయం 11 గంటల 10 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మూవీకి మొదట క్రిష్ దర్శకత్వం వహించగా.. కారణాలేంటో తెలీదు గానీ మధ్యలోనే తప్పుకున్నాడు. దీంతో చిత్ర నిర్మాత ఏఎమ్ రత్నం కొడుకు జ్యోతికృష్ణ.. డైరెక్షన్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయినప్పటికీ పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీలో బాబీ డియోల్, అనుపమ ఖేర్, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించారు.

**త్రివిక్రమ్‌పై మా అసోసియేషన్‌కు ఫిర్యాదు**

పూనమ్ కౌర్ టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై ఇప్పటికే మూవీ ఆర్టిస్ట్ అసిసోయేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. గతంలోనే మెయిల్ ద్వారా ఇప్పటికే మా అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపింది. క్లియర్‌గా త్రివిక్రమ్ శ్రీనివాస్‌పైనే ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. అంతేకాదు రాజకీయ, సినీ ఇండస్ట్రీ నుంచి ఎవరో కాపాడుతున్నారని కూడా చెప్పానని పూనమ్ కౌర్ ప్రస్తావించింది. ఈ విషయంపై నేను మహిళల గ్రూప్‌తో మాట్లాడతానని కూడా పూనమ్ వెల్లడించింది. అంతే కాకుండా తన మెయిల్‌కు రిప్లై కూడా వచ్చిన స్క్రీన్‌షాట్‌ను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

# సుష్మితా సేన్‌కి అరుదైన వ్యాధి.. 8 గంటలకో స్టెరాయిడ్, లేదంటే..



నటీనటులు కూడా మనుషులే. వాళ్లకు అందరిలాగే కోపాలు, బాధలు, సమస్యలు ఉంటాయి. కానీ వాటిని బయట ప్రపంచానికి తెలియనీకుండా.. సంతోషంగా ఉన్నట్లు నటిస్తూ ప్రేక్షకులను, అభిమానులను అలరిస్తుంటారు. అలాంటి వారిలో నటి సుష్మితా సేన్ కూడా ఒకరు. తన అందచందాలతో అలరించడమే కాకుండా.. బోల్డ్ స్టేట్‌మెంట్స్ , జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఓ వర్గానికి ఇన్సిపిరేషన్‌గా నిలిచిన ఈ మాజీ మిస్ యూనివర్స్.. ఒకప్పుడు చావు అంచులదాక వెళ్లి వచ్చింది. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూనే..తెరపై ఎనర్జిటిక్‌గా కనిపించింది. మొన్నటి వరకు ప్రతి ఎనిమిది గంటలకు ఒకసారి స్టెరాయిడ్ తీసుకునేదట. ఆమె తీసుకున్న ఓ నిర్ణయమే ఇప్పుడు ఆమెని ఆరోగ్యకరంగా ఉండేలా చేసిందట.

ఏం జరిగింది?


సుష్మిత కెరీర్ పరంగా బిజీగా ఉన్న సమయంలోనే అనారోగ్య సమస్యలతో పోరాటం చేయాల్సి వచ్చిందట. ఈ విషయాన్ని తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. 2014 నుంచే ఆమె ఆటో ఇమ్యూన్ డిజార్డర్ అయిన అడిసన్స్ డిసీజ్‌తో బాధపడుతున్నటు వెల్లడించింది. ఆమె శరీరంలో కార్డిసోల్ అనే హార్మోన్ ఉందని తేలిందట. ఇది ప్రాణాంతకమైనది అని..దీన్ని సరి చేయాలంటే.. ప్రతి 8 గటలకు ఒకసారి హైడ్రో కార్డిసోన్ అనే స్టెరాయిడ్‌ని ఇంజెక్ట్ చేయాలని వైద్యులు చెప్పారట. అలాగే వ్యాయామాలు, బరువైన పనులు చేయకూడదని సూచించారట.

జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్

కానీ సుష్మిత మాత్రం తన ఫిట్నెస్ కోచ్‌ని పిలిపించుకొని జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేసిదంట. యాంటీ గ్రావిటీ వ్యాయామాలతో పాటు డిటాక్సిఫికేషన్ ప్రారంభించిందట. అయితే ఓ రోజు సుష్మిత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో దుబాయ్ నుంచి అబుదబీ తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆ తర్వాత టర్కీ వైద్యులు ఫోన్ చేసి సుష్మితా జీవితంలో మిరాకిల్ జరిగిందని చెప్పాడట. తన అడ్రిల్ గ్రంధి ఇప్పుడు సవ్యంగా పని చేస్తుందని చెప్పారట. తన 35 ఏళ్ల వైద్య కెరీర్‌లో ఇలా జరగడం ఇదే మొదటిసారి అని ఆశ్చర్యం వ్యక్తం చేశాడట. ఇకపై ఎనిమిది గంటలకు ఒకసారి స్టెరాయిడ్ తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పడంతో సుష్మితా ఊపిరిపీల్చుకుందంట.

1975,నవంబర్ 19న ఓ బెంగాలీ కుటుంబంలో జన్మించిన సుస్మితా సేన్ తనకు 18వ ఏట(1994) విశ్వసుందరిగా కిరీటం అందుకుని చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. 1997లో రత్సగన్ అనే తమిళ్ సినిమాతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత పలువరు అగ్రహీరోలతో సినిమాలు చేసింది. తెలుగులో నాగార్జున తో కలిసి 'రక్షకుడు' అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఆ తర్వాత బాలీవుడ్‌లోనూ రాణించింది. ప్రస్తుతం పలు చిత్రాలతో పాటు వెబ్ సిరీస్ చేస్తూ కెరీర్ పరంగా ఇప్పటికీ బీజీగా ఉన్నారు.

# నెవ్వర్ బిఫోర్ పాత్రలో రష్మిక.. కొత్త ప్రాజెక్ట్ ప్రకటన



'కుబేర'తో తాజాగా విజయాన్ని సొంతం చేసుకున్న రష్మిక ఇప్పుడు మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'మైసా' అనే సినిమాతో రానున్నారు. రవీంద్ర పూలే దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఐదు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. టైటిల్ పోస్ట్‌లో రష్మిక భయంకరమైన అవతారంలో కనిపించి ఆసక్తి పెంచారు. ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ''ధైర్యం ఆమె బలం. సంకల్పంలో లేదు కనికరం.. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి''..! అంటూ నిర్మాణసంస్థ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో రష్మిక వారియర్‌గా కనిపించనున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. ''నేను ఎప్పుడూ కొత్తది, భిన్నమైనది, ఉత్తేజకరమైన చిత్రాలకు ప్రాధాన్యమిస్తాను. 'మైసా' అలాంటి వాటిలో ఒకటి. నేను ఇంతకు ముందెప్పుడూ పోషించని పాత్ర. ఎప్పుడూ అడుగుపెట్టని ప్రపంచం. ఇప్పటి వరకూ చేయని వెర్షన్. ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే..'' అంటూ రష్మిక ఈ సినిమా వివరాలు పంచుకున్నారు.ఇటీవల కాలంలో రష్మిక నటించిన సినిమాల్లో 'సికందర్' మినహా మిగిలినవన్నీ బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. కుబేర కూడా రూ.100కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రస్తుతం ఆమె లైనప్ ఆసక్తికరంగా ఉంది. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న నాయికా ప్రాధాన్య చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తున్నారు. అలాగే, బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానాకు జంటగా 'థామా'తో పలకరించనున్నారు. దీనికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రంగా ఇది రూపొందుతోంది. ఇప్పుడు 'మైసా'ను ప్రకటించారు. వీటి తర్వాత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'పుష్ప2'కు సీక్వెల్లోనూ ఈ బ్యూటీ నటించనున్నారు.

# 'అఖండ 2'లో 'బజరంగీ భాయిజాన్' బాలనటి.. టీమ్ ప్రకటన



సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'బజరంగీ భాయిజాన్'లో మున్ని పాత్రలో కనిపించి ప్రేక్షకుల మది గెలుచుకున్న నటి హర్షాలీ మల్హోత్ర . ఇప్పుడీమె టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. అగ్ర నటుడు బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతోన్న సరికొత్త చిత్రం 'అఖండ 2: తాండవం' లో నటించే అవకాశాన్ని ఈ నటి సొంతం చేసుకున్నారు. ఇదే విషయాన్ని టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఆమె జనని పాత్రలో కనిపించనున్నారని వెల్లడించింది. ఈ మేరకు టీమ్‌లోకి ఆమెను స్వాగతిస్తూ పోస్ట్ పెట్టింది.ముంబయికి చెందిన హర్షాలీ మల్హోత్ర బాలనటిగా కెరీర్ మొదలుపెట్టారు. హిందీలో తెరకెక్కిన పలు సీరియల్స్‌లో నటించారు. 2015లో విడుదలైన 'బజరంగీ భాయిజాన్' ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టింది. బధిర బాలిక పాత్రలో ఆమె నటన సినీ ప్రియుల హృదయాలను హత్తుకుంది. ఈ చిత్రానికి గాను పలు అవార్డులు సైతం లభించాయి.బాలకృష్ణ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేక క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ కాంబోలో దైవిక అంశాలతో రూపొందిన యాక్షన్ డ్రామా మూవీ 'అఖండ' 2021లో విడుదలై మంచి విజయం సాధించింది. దానికి కొనసాగింపుగా తెరకెక్కుతోంది 'అఖండ 2: తాండవం'. ఈ మూవీలో సంయుక్త, ఆది పినిశెట్టి ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. తొలిభాగంలో నటించిన జగపతిబాబు తదితరులు సీక్వెల్‌లోనూ నటిస్తున్నారు. ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ చిత్రం దసరా సందర్భంగా సెప్టెంబరు 25న విడుదల కానుంది.

# 'దంగల్ నటితో రొమాన్స్'.. డైరెక్టర్‌తో ఆ విషయం చెప్పా: అమిర్ ఖాన్



ఆమిర్ ఖాన్ ఇటీవలే 'సితారే జమీన్ పర్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. గతనెల విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 100కోట్ల మార్కును దాటేసింది. అయితే గతంలో అమిర్ ఖాన్ నటించిన దంగల్ మూవీ రికార్డ్ స్థాయిలో వసూళ్లు సాధించింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రాల జాబితాలో మొదటిస్థానంలో ఉంది. ఈ మూవీలో బాలీవుడ్ ఫాతిమా సనా షేక్ అమిర్ ఖాన్ కూతురిగా మెప్పించింది.

అయితే దంగల్‌లో అమిర్ ఖాన్ కూతురిగా నటించిన ఫాతిమా సనా షేక్ ఆ తర్వాత 2018లో వచ్చి థగ్స్ ఆఫ్ హిందూస్తాన్ మూవీలో హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రంలో అమిర్ ఖాన్ కలిసి రొమాన్స్ చేసింది. అయితే తన కూతురి పాత్రలో నటించిన ఆమెతో అమిర్ ఖాన్ రొమాన్స్ చేయడంపై తాజాగా స్పందించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఆయన.. ఈ సినిమా మా ఇద్దరి మధ్య ఎలాంటి రొమాంటిక్ యాంగిల్ ఉండదని థగ్స్ ఆఫ్ హిందూస్తాన్ డైరెక్టర్ విజయ్ కృష్ణ ఆచార్య అన్నారని గుర్తు చేశారు.

అయితే తనకు ప్రేమికుడిగా నటించడానికి ఫాతిమాకు ఎలాంటి అభ్యంతరం లేదని డైరెక్టర్‌తో చెప్పానని అమిర్ ఖాన్ వెల్లడించారు. ఎందుకంటే నేను ఆమె తండ్రిగా ఒక సినిమాలో మాత్రమే నటించా.. నిజ జీవితంలో కాదని డైరెక్టర్‌తో చెప్పినట్లు తెలిపారు. నేను నిజ జీవితంలో ఆమె ప్రియుడిని కాదు.. మేమిద్దరం కలిసి కేవలం సినిమా చేస్తున్నామని దర్శకుడితో చెప్పినట్లు వివరించారు. అంతే కాకుండా గత సినిమాల్లో తల్లికొడుకులుగా నటించిన అమితాబ్ బచ్చన్ వహీదా రెహ్మాన్‌లు.. ఆ తర్వాత ప్రేమికులుగా నటించారని అమిర్ గుర్తు చేశారు. దీపిక, ఆలియా భట్, శ్రద్ధా కపూర్ లాంటి తారలు ఈ మూవీని రిజెక్ట్ చేసినప్పటికీ ఫాతిమా ఈ చిత్రానికి సంతకం చేశారని అమిర్ ఖాన్ తెలిపారు. ఇది ఒక అద్భుతమైన సినిమా అని నిర్మాత ఆదిత్య చోప్రా నుంచి కాల్ వచ్చిన తర్వాత తాను షాక్ అయినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్' బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేకపోయింది.



# దుబాయ్‌లో ప్రపంచ కబడ్డీ లీగ్

**న్యూఢిల్లీ:** మనదేశంలో విశేషాదరణ చూరగొన్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) త్వరలో విశ్వవ్యాప్తంగా కూత పెట్టేందుకు ముస్తాబైంది. ప్రపంచ సూపర్ కబడ్డీ లీగ్ (డబ్ల్యూఎస్‌కేఎల్)కు వచ్చే ఏడాది నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ప్రారంభ ప్రపంచ లీగ్ దుబాయ్‌లో వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య (ఐకేఎఫ్) భాగస్వామ్యంతో ఫ్రాంచైజీ లీగ్ నిర్వహిస్తామని డబ్ల్యూఎస్‌కేఎల్ వర్గాలు తెలిపాయి.

మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీల్లో పటిష్టమైన భారత బలగం ప్రధాన భూమిక పోషించనుంది. 'ఒక్క భారత్‌లోనే కాదు... ప్రపంచస్థాయిలోనే కబడ్డీ క్రీడా ఎంతో ఎదిగింది. అంతర్జాతీయ క్రీడల్లో మన గ్రామీణ ఆట ప్రముఖ స్థానం సంపాదించుకుంది. పీకేఎల్ ద్వారా దేశంలో సంపాదించుకున్న అభిమాన దళాన్ని ఇక మీదట ప్రపంచ వ్యాప్తంగా సంపాదించుకునేందుకు వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్ దోహదం చేస్తుంది. తద్వారా భవిష్యత్తులో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) గుర్తింపు కూడా పొందాలన్నదే మా ప్రధాన లక్ష్యం' అని ఎస్‌జే కబడ్డీ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు శాంభవ్ జైన్ తెలిపారు. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే డబ్ల్యూఎస్‌కేఎల్ టోర్నీ జరగనుంది.

అంతర్జాతీయ కబడ్డీలో రాణిస్తున్న దక్షిణ కొరియా, ఇరాన్, థాయ్‌లాండ్, పాకిస్తాన్, మలేసియా, జపాన్, కెనడా, అమెరికా దేశాల కబడ్డీ సమాఖ్యలు ఈ లీగ్‌పై ఆసక్తి కనబరుస్తున్నాయని ఆయన చెప్పారు. ఒక్కో ఫ్రాంచైజీ ఆటగాళ్ల కొనుగోలు కోసం రూ. 48 కోట్ల పర్సు కలిగి ఉంటుంది. ముందుగా ఎనిమిది ఫ్రాంచైజీల ఎంపిక అనంతరం పూర్తిస్థాయి వివరాలు వెల్లడవుతాయని ఆయన పేర్కొన్నారు.

# వరుసగా మూడో మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం.. ఈసారి ఊచకోత

14 ఏళ్ల భారత యువ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ ఇంగ్లండ్ గడ్డపై వరుసగా మూడో మ్యాచ్‌లోనూ చెలరేగిపోయాడు. ఇంగ్లండ్ అండర్ 19 జట్టుతో జరిగిన తొలి రెండు వన్డేల్లో విధ్వంసం సృష్టించిన వైభవ్.. ఇవాళ (జులై 2) జరుగుతున్న మూడో వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు.

నార్తంప్టన్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన వైభవ్.. మొత్తంగా 31 బంతులు ఎదుర్కొని 6 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 86 పరుగులు చేశాడు.

వైభవ్ స్కోర్‌లో 78 పరుగులు బౌండరీలు, సిక్సర్ల రూపంలో రావడం విశేషం. వైభవ్ ధాటికి భారత్ 8 ఓవర్లలో 111 పరుగులు చేసింది. వర్షం కారణంగా 40 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 6 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ డాకిన్స్ (62), కెప్టెన్ థామస్ రూ (44 బంతుల్లో 76 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. మరో ఓపెనర్ ఇస్సాక్ (41), బెన్ మేస్ (31), రాల్ఫీ ఆల్బర్ట్ (21) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు.


ఇంగ్లండ్ దిగ్గజ ఆల్‌రౌండర్ తనయుడు రాకీ ఫ్లింటాఫ్ (16) తక్కువ స్కోర్‌కే ఔట్ కాగా.. జోసఫ్ మూర్స్ డకౌటై నిరాశపరిచాడు. సెబాస్టియన్ మోర్గాన్ 10 పరుగులతో అజేయంగా నిలిచాడు. భారత బౌలర్లలో కనిష్క 3 వికెట్లు తీయగా.. దీపేశ్ దేవేంద్రన్, విహాన్ మల్హోత్రా, నమన్ పుష్పక్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్.. వైభవ్ విధ్వంసం ధాటికి 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. వైభవ్‌తో పాటు ఇన్నింగ్స్ ప్రారంభించిన అభిగ్యాన్ కుందు 12.. నాలుగో స్థానంలో బరిలోకి దిగిన చవ్దా డకౌటయ్యాడు. ప్రస్తుతం విహాన్ మల్హోత్రా (25), రాహుల్ కుమార్ (1) క్రీజ్‌లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవాలంటే 30 ఓవర్లలో మరో 142 పరుగులు చేయాలి. చేతిలో 7 వికెట్లు ఉన్నాయి. ఇంగ్లండ్ బౌలర్లలో అలెగ్జాండర్ వేడ్ 2 వికెట్లు తీయగా.. జేమ్స్ మింటో ఓ వికెట్ పడగొట్టాడు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్లు తలో మ్యాచ్ గెలిచాయి. తొలి వన్డేలో గెలిచి భారత్ బోణీ కొట్టగా.. ఉత్కంఠభరితంగా సాగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ వికెట్ తేడాతో బయటపడింది.

**వైభవ్ హిట్.. ఆయుశ్ మాత్రే ఫట్**

తొలి మ్యాచ్‌లో 19 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 48 పరుగులు చేసిన వైభవ్.. రెండో వన్డేలో 34 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 45 పరుగులు చేశాడు. ఆయుశ్ మాత్రే విషయానికొస్తే.. ఇతను వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. తొలి వన్డేలో 21 పరుగులు చేసిన మాత్రే.. రెండో వన్డే గోల్డెన్ డకౌటయ్యాడు. ఇవాల్టి మ్యాచ్‌లో మాత్రే ఆడటం లేదు. అతని స్థానంలో అభిగ్యాన్ కుందు భారత జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు.





# మరో స్టార్ అవుట్

**బెంగళూరు:** భారత్‌లో జరగనున్న తొలి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్... 'నీరజ్ చోప్రా క్లాసిక్' నుంచి ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) వైదొలిగాడు. మడమ గాయం కారణంగా 27 ఏళ్ల పీటర్స్ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ నుంచి తప్పుకొన్నాడు. ఇప్పటికే పలువురు జావెలిన్ త్రోయర్లు ఈ ఈవెంట్‌కు దూరం కాగా... ఇప్పుడు ఆ జాబితాలో పీటర్స్ కూడా చేరాడు. ఇక 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన పీటర్స్ స్థానాన్ని పోలాండ్‌కు చెందిన సిప్రియన్ మ్రిగ్లాడ్ భర్తీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'పీటర్స్ గాయం కారణంగా 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్‌కు దూరమయ్యాడు. అతడి స్థానాన్ని పోలాండ్‌కు చెందిన అథ్లెట్ సిప్రియన్ భర్తీ చేస్తాడు' అని వెల్లడించారు. అండర్ 23 యూరోపియన్ మాజీ చాంపియన్ అయిన సిప్రియన్ అత్యుత్తమ ప్రదర్శన 84.97 మీటర్లు. శనివారం బెంగళూరు వేదికగా జరగనున్న నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్‌కు అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య 'ఎ' కేటగిరీ గుర్తింపునిచ్చింది.

మొత్తం 12 మంది జావెలిన్ త్రోయర్లు పాల్గొంటున్న ఈ ఈవెంట్‌లో భారత్ నుంచి ఐదుగురు అథ్లెట్లు పోటీలో ఉన్నారు. అయితే వేర్వేరు కారణాల వల్ల ఇప్పటికే ముగ్గురు ప్లేయర్లు టోర్నీకి దూరం కాగా... వారి స్థానాల్లో ఇతరులను ఎంపిక చేశారు. భారత త్రోయర్ కిషోర్ జెనా గాయం కారణంగా ఈ ఈవెంట్‌కు దూరం కావడంతో అతడి స్థానంలో యశ్‌వీర్‌సింగ్ బరిలోకి దిగనున్నాడు. జెన్కీ డీన్ (జపాన్) స్థానాన్ని మార్టిన్ కొనెస్నీ (పోలాండ్)తో భర్తీ చేశారు.ఈ టోర్నీలో నీరజ్ చోప్రాతో పాటు అంతర్జాతీయ స్టార్లు జూలియస్ యెగో (కెన్యా), థామస్ రహ్లెర్ (జర్మనీ), సిప్రియన్ మ్రిగ్లాడ్, మార్టిన్ కొనెస్నీ, కర్టీస్ థాంప్సన్ (అమెరికా), లూయిస్ మౌరిసియో డా సిల్వా (బ్రెజిల్), రమేశ్ పతిరగె (శ్రీలంక) పాల్గొననున్నారు. భారత్ నుంచి నీరజ్‌తోపాటు సచిన్ యాదవ్, రోహిత్ యాదవ్, సాహిల్, యశ్‌వీర్ సింగ్ బరిలోకి దిగనున్నారు.

# టీమిండియాను ఆదుకున్న కెప్టెన్ 'గిల్' సెంచరీ

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్ట్ ఇవాళ (జులై 2) ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ కోసం భారత్ మూడు మార్పులు చేయగా.. ఇంగ్లండ్ తొలి టెస్ట్‌లో ఆడిన జట్టునే యధాతథంగా కొనసాగించింది. భారత్ తరఫున బుమ్రా స్థానంలో ఆకాశ్‌దీప్.. సాయి సుదర్శన్ స్థానంలో వాషింగ్టన్ సుందర్.. శార్దూల్ ఠాకూర్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేస్తున్న భారత్‌కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఇన్ ఫామ్ బ్యాటర్ కేఎల్ రాహుల్ 2 పరుగులకే ఔటై నిరాశపరిచాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రాహుల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రాహుల్ తర్వాత బరిలోకి దిగిన కరుణ్ నాయర్ కూడా తక్కువ స్కోర్‌కే (31) ఔటయ్యాడు. కరుణ్ వికెట్ బ్రైడన్ కార్స్‌కు దక్కింది. ఈ మధ్యలో యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.జైస్వాల్‌కు టెస్ట్‌ల్లో ఇది 11వ అర్ధ సెంచరీ.జైస్వాల్ తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగిన విషయం తెలిసిందే. రాహుల్, కరుణ్ వికెట్లు కోల్పోయాక జాగ్రత్తగా ఆడిన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. ఈ దశలో జైస్వాల్ (107 బంతుల్లో 13 ఫోర్ల సాయంతో 87 పరుగులు) ఓ అనవసర షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో కట్ షాట్ ఆడే ప్రయత్నం చేయగా బంతి బాటమ్ ఎడ్జ్ తీసుకొని వికెట్‌కీపర్ జేమీ స్మిత్ చేతుల్లోకి వెళ్లింది. జైస్వాల్ ఔటయ్యాక శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ కొద్ది సేపు జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 47 పరుగులు జోడించాక రిషబ్ పంత్ (25) షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. జాక్ క్రాలే అద్భుతమైన క్యాచ్ పట్టడంతో పంత్ పెవిలియన్ బాట పట్టాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి (1) ఇలా వచ్చి అలా వెళ్లాడు. ఇతని వికెట్ వోక్స్‌కు దక్కింది. వోక్స్ బౌలింగ్‌లో నితీశ్ క్లీన్ బౌల్ట్ అయ్యాడు. 211 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న టీమిండియాను గిల్, రవీంద్ర జడేజా గట్టెక్కించే ప్రయత్నం చేశారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 99 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌లను కొనసాగిస్తున్నారు. గిల్ 114, రవీంద్ర జడేజా 41 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. 85 ఓవర్ల తర్వాత టీమిండియా స్కోర్ 310/5గా ఉంది.





# శ్రీలంక కెప్టెన్ సూపర్ శతకం.. గత మూడు ఇన్నింగ్స్‌ల్లో రెండవది

కొలొంబో వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో శ్రీలంక సారధి చరిత్ అసలంక సూపర్ సెంచరీతో మెరిశాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఐదో స్థానంలో బరిలోకి దిగిన అసలంక.. 123 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 106 పరుగులు చేసి ఔటయ్యాడు. గత మూడు ఇన్నింగ్స్‌ల్లో అసలంకకు ఇది రెండో సెంచరీ. ఓవరాల్‌గా అతని కెరీర్‌లో ఐదవది.

అసలంక చివరిగా ఆస్ట్రేలియాతో ఆడిన వన్డేల్లో వరుసగా 127, 78 నాటౌట్ పరుగులు చేశాడు. గత కొన్నేళ్లుగా అసలంక వన్డేల్లో అత్యంత నమ్మదగిన బ్యాటర్‌గా మారాడు. 2024లో 97.11 స్ట్రయిక్‌రేట్‌తో 50.41 సగటున పరుగులు చేసిన అసలంక.. ఈ ఏడాది ఏకంగా 68 సగటున, 96.03 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధిస్తున్నాడు. కెరీర్‌లో ఇప్పటివరకు 74 వన్డేలు ఆడిన అసలంక 44.98 సగటున 5 సెంచరీలు, 15 అర్ధ సెంచరీల సాయంతో 2474 పరుగులు చేశాడు.బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అసలంక ఆదుకోవడంతో శ్రీలంక గౌరవప్రదమైన స్కోర్ (49.2 ఓవర్లలో 244 పరుగులు) చేయగలిగింది. జట్టులో మిగతా బ్యాటర్లెవ్వరూ రాణించకపోగా అసలంక ఒక్కడే జట్టు భారం మొత్తాన్ని మోశాడు. కుసాల్ మెండిస్ (45), జనిత్ లియనాగే (29), మిలన్ రత్నాయకే (22), హసరంగ (22) రెండంకెల స్కోర్లు చేసి అసలంకకు సహకరించారు.

కొద్ది రోజుల కిందట బంగ్లాదేశ్‌తోనే జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో భారీ శతకం బాదిన పథుమ్ నిస్సంక ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. 8 బంతులు ఎదుర్కొని డకౌటయ్యాడు. మరో స్టార్ బ్యాటర్ కమిందు మెండిస్ కూడా ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు.

ఓపెనర్ నిషాన్ మదుష్క 6, తీక్షణ 1, ఎషాన్ మలింగ 5, అశిత ఫెర్నాండో 1 (నాటౌట్) పరుగులు చేశారు. బంగ్లా బౌలర్లలో తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. వీరిలో తస్కిన్ 4 వికెట్లు పడగొట్టగా.. తంజిమ్ 3 వికెట్లు తీశాడు. తన్వీర్ ఇస్లాం, షాంటో తలో వికెట్ దక్కించుకున్నారు.

3 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న తొలి వన్డే ఇది. దీనికి ముందు జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 10 తేడాతో కైవసం చేసుకుంది. వన్డే సిరీస్ తర్వాత ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా జరుగనుంది.

# అర్షదీప్ వద్దు!.. బుమ్రా స్థానంలో అతడే సరైనోడు: ఇర్ఫాన్ పఠాన్

ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు ముందు భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ టీమిండియా నాయకత్వ బృందానికి కీలక సూచనలు చేశాడు. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఆకాశ్ దీప్‌తో భర్తీ చేస్తే బాగుంటుందన్నాడు. మహ్మద్ షమీ మాదిరి ఈ బెంగాల్ పేసర్ రాణించగలడని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు.ఐదు టెస్టులు ఆడేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లిన టీమిండియా.. ఓటమితో ఈ సిరీస్‌ను మొదలుపెట్టింది. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. ఇక బుమ్రాపై పనిభారం తగ్గించే నిమితం టీమిండియా మేనేజ్‌మెంట్ అతడిని ఇక్కడ కేవలం మూడు టెస్టుల్లో మాత్రమే ఆడించనుంది.

**షమీ మాదిరి ఆకట్టుకోగలడు**

ఈ నేపథ్యంలో బర్మింగ్‌హామ్‌లో జరిగే రెండో టెస్టుకు బుమ్రాకు విశ్రాంతినిస్తారని తెలుస్తోంది. ఈ విషయంపై స్పందించిన ఇర్ఫాన్ పఠాన్ తన యూట్యూబ్ చానెల్ వేదికగా అభిప్రాయాలు పంచుకున్నాడు."ఒకవేళ బుమ్రా గనుక ఈ టెస్టు ఆడకపోతే.. అతడి స్థానంలో సరైన బౌలర్ ఎవరంటే.. ఆకాశ్ దీప్. నెట్స్‌లో అతడి ప్రాక్టీస్ చూస్తుంటే.. షమీ మాదిరి ఆకట్టుకోగలడని అనిపిస్తోంది. సీమ్, స్వింగ్‌పై మరింతగా దృష్టి సారిస్తే.. కచ్చితంగా ఇంగ్లండ్ బ్యాటర్లను అతడు ఇబ్బంది పెట్టగలడు.

అర్షదీప్ వద్దు!.. బుమ్రా స్థానంలో అతడే సరైనోడు

అర్షదీప్ కూడా రేసులో ఉన్నాడు. కానీ బుమ్రా ఒకవేళ రెండో టెస్టు ఆడకపోతే అతడి స్థానంలో ఆకాశ్ దీప్‌ను తప్పక ఎంపిక చేయాలి'' అని ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇదిలా ఉంటే.. మంగళవారం మీడియాతో మాట్లాడిన టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్.. బుమ్రా రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడని స్పష్టం చేశాడు. అయితే, అతడిని ఆడించే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నాడు.

మరోవైపు.. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ పొడిగా ఉండనున్న నేపథ్యంలో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుదిజట్టులోకి రావడం ఖాయమని మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు అంటున్నారు. కాగా భారత్ ఇంగ్లండ్ మధ్య జూలై 26 వరకు రెండో టెస్టు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది.



**ఇదిలా ఉంటే..**

ఆకాశ్ దీప్ టీమిండియా తరఫున ఇప్పటి వరకు ఏడు టెస్టులు ఆడి పదిహేను వికెట్లు తీశాడు. మరోవైపు.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూసుకుపోతున్న అర్షదీప్.. సుదీర్ఘ ఫార్మాట్లో ఇంకా అరంగేట్రం చేయలేదు. ఇక టీమిండియాతో రెండో టెస్టుకు ఇంగ్లండ్ ఇప్పటికే తమ తుదిజట్టును ప్రకటించింది.

**భారత్‌తో రెండో టెస్టు కోసం ఇంగ్లండ్ తుది జట్టు ఇదే**

**జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.**